ఘనంగా ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన పూజలు



పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ఆదర్శ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి, శ్రీ శివ పంచముఖ దేవాలయంలో శ్రావణమాస అష్టోత్తర శతకలాభిషేక సహిత మన్యరుద్రావన ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు ఆయనకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు లక్ష్మణ్, కుమారస్వామి, పుణ కృష్ణ, సత్యనారాయణ, సురేష్, పి.రవి, బాలరాజ్, శ్రీశైలం, నరేష్, ఎన్ను శ్రీనివాస్‌రెడ్డి, బబ్లూ, ఎన్ను శంకర్‌రెడ్డి, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

రాజేంద్రనగర్: ప్రజావాణి కార్యక్రమానికి అందే ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి ఫిర్యాదునూ సంబంధిత అధికారుల పర్యవేక్షణలో పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సర్కిల్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.


ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



రామాలయం గడప పూజలు చేసిన నాయకులు

మణికొండ: దేవాలయాలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తుందని తద్వారా మానసిక ప్రశాంతత, ఉత్తేజం కలుగుతాయని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. చిత్రపురి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి సోమవారం గడప ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకుని మనశ్శాంతితో జీవించాలన్నారు. నిత్యం దేవాలయాన్ని దర్శించుకుంటే నూతన ఉత్తేజంతో జీవించవచ్చన్నారు. బీజేపీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివరాంరెడ్డి, నాయకులు జె.సిద్దప్ప, సి.బీరప్ప, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



శంషాబాద్: ఆత్మ రక్షణకు కరాటే లాంటి విద్యలు ఎంతగానో ఉపకరిస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. మధురానగర్ కాలనీలోని బీఎన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. కోచ్ భగవాన్‌దాస్ శిక్షణలో విద్యార్థులు జాతీయ స్థాయి అవార్డులు గెలుచుకుని శంషాబాద్ పట్టణానికి మంచి పేరు తీసుకొచ్చారని పలువురు ఈ సందర్భంగా కోచ్‌ను అభినందించారు. బీఆర్‌ఎస్ లీగల్ సెల్ సీనియర్ నేత కొనమొల్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నాం

మణికొండ ఏఈ సంతోష్‌కుమార్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో నెలకొనే విద్యుత్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నామని మణికొండ ఏఈ సంతోష్‌కుమార్ తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీలో విద్యుత్ వైర్లు కిందకు వేలాడటంతో ప్రమాదం పొంచి ఉందంటూ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు ఎ.వంశీ విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం ఏఈ నేతృత్వంలో ఆయా వైర్లకు మరమ్మతులు చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ... నిత్యం విద్యుత్ వైర్లకు సమీపంలో ఉన్న చెట్లతో సరఫరాకు అంతారాయం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు, హుడా కాలనీ అధ్యక్షుడు రాజశేఖర్, శ్రీనివాస్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాబురావు తదితరులు పాల్గొన్నారు.



అత్తాపూర్ రహదారిపై ఏర్పడిన గుంతలు

రోడ్లన్నీ గుంతలు.. వాహనదారుల వెతలు..!

- ప్రమాదకరంగా తయారవుతున్న రహదారులు
- వాహనదారుల్లో సర్వత్రా ఆందోళన
- మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం
- పట్టించుకోని అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం

అత్తాపూర్: హైదర్‌గూడ సర్దార్ వల్లభాయ్ పటేల్ చౌరస్తా నుంచి అత్తాపూర్ హనుమాన్ టెంపుల్ వరకు ఉన్న పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ ఎలివేటెడ్ వే సర్వీస్ రోడ్డు మార్గం ఎక్కడికి అక్కడ గుంతలు పడి అధ్వానంగా తయారైంది. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నాణ్యత ప్రమాణాలతో చేయకపోవడం కారణంగా ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- గుంతల కారణంగా ఈ సర్వీస్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేనడం అతిశయోక్తికాదు. వాహనదారులేకాకుండా పాదచారులు సైతం గుంతల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల అత్తాపూర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళా ఫార్మసిస్టును ఈ సర్వీస్ రోడ్డు మార్గం గుండా శరవేగంగా వెళ్లిన మినీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో ఫార్మసీ ఉద్యోగి కోమాలోకి వెళ్లింది.
- ఇలా ఏదో ఒక ప్రాంతంలో దాదాపు నిత్యం చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. దీనికి తోడు పి.వి.నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే 120 పిల్లర్ సమీపంలో ప్రధాన రహదారి పక్కనే గృహ నిర్మాణాలకు ఉపయోగించే ఇసుకను నిల్వ ఉంచారు. ఇసుక డంపింగ్ కేంద్రంగా మార్చడంతో నిత్యం వివిధ అవసరాల నిమిత్తం చిన్నచిన్న ట్రక్కుల మొదలుకొని పెద్దపెద్ద ట్రాలీలు రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి.



రోడ్డు మధ్యలో కుంగిపోయిన డ్రైనేజీ మ్యాన్‌హోల్

తరచూ ప్రమాదాలు



హైదర్‌గూడ, అత్తాపూర్ పరిసర ప్రాంతాలలో స్వీపింగ్ కార్యక్రమాలు చేపడుతుంటాను. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్థానికంగా పని చేస్తూ వాహనాల రాకపోకలపై దృష్టి సారిస్తాను. ఉదయం 7 నుంచి 9 గంటల ప్రాంతంలో కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగుల రద్దీ అధికంగా ఉంటుంది. ఈ సర్వీస్ రోడ్డు మార్గం వాహనాలకు అనుకూలంగా లేనందున ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

– యాదయ్య, జీహెచ్‌ఎంసీ సిబ్బంది

- ఒక వైపు రోడ్డు మార్గాలు చిత్తడిగా మారడం... మరో వైపు సర్వీస్ రోడ్డులో అనుమతి లేని వాహనాలు తిరగడం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసుల ఉన్నతాధికారులు దృష్టి సారించడంతో పాటు ఆర్‌అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి



కోకాపేట చెరువు వద్ద మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: చెరువులతోనే జీవవైవిధ్యం మెరుగుపడుతుందని, వాటిని పరిరక్షించుకుంటూ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట కొత్త చెరువు వద్ద నార్సింగి మున్సిపాలిటీ తరఫున నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జెమినీ ఎడిబుల్స్, ఫాట్స్ ఇండియా లిమిటెడ్ (జీఈఎఫ్ ఇండియా) సంస్థ తమ సీఎస్‌ఆర్ నిధులతో కోకాపేట చెరువు అభివృద్ధికి ముందుకు రావాటం అభినందనీయం అని అన్నారు. గడచిన ఆరు నెలలుగా చెరువు వద్ద ధృవాన్ష్ ఎన్‌జీఓతో కలిసి చెరువు చుట్టూ ఉన్న ముళ్ల చెట్లను తొలగించటం, కట్ట మరమ్మతు, ప్రవేశ ద్వారాలు, సీసీ కెమెరాలు, సందర్శకులు కూర్చునే ప్రాంతాల అభివృద్ధి, నీటి నాణ్యత పెంచేందుకు వెట్ లాండ్‌ల ఏర్పాటు, స్ప్రింక్లర్లతో ఆక్సిజన్ శాతం పెంచటం లాంటి పనులను చేపట్టారని ఎమ్మెల్యే వివరించారు. దాంతో చెరువు వద్దకు పక్షుల రాకపోకలు, పర్యావరణ పునరుజ్జీవం పొందుతోందన్నారు. చెరువు చుట్టూ పెద్ద ఎత్తున మొక్కలను నాటి వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తే మరింత మందికి ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. జీఈఎఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అక్షయ్ చౌదరి మాట్లాడుతూ... సమాజానికి మేలు చేయటం, సహజ వనరులను భవిష్యత్ తరాలకు అందించటం, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చెరువుల పునరుద్ధరరణకు తమ వంతు సహకారం అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఐజీ డైరెక్టర్ అర్చన సురేష్, నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణమోహన్‌రెడ్డి, లేక్ ప్రొటెక్షన్ సెల్ అధికారి కృష్ణారావు, ధృవాన్ష్ ప్రతినిధి మధులిక చౌదరి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపల్ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్, పలువురు మాజీ కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలన

- హిమాయత్‌సాగర్ – రాజేంద్రనగర్ రోడ్డు మూసివేత
- వరద తగ్గిన తరువాత పునరుద్ధరిస్తాం
- ట్రాఫిక్ డీసీపీ మనోహర్



వరదను పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీసీపీ మనోహర్, ఏసీపీ బాలాజీ, రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ రాజు

రాజేంద్రనగర్: హిమాయత్‌సాగర్ వరద ముంపు ప్రభావిత ప్రాంతాలను ట్రాఫిక్ డీసీపీ మనోహర్, ఏసీపీ బాలాజీ, రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ రాజులు సోమవారం పరిశీలించారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో హిమాయత్‌సాగర్ వరద గేట్లను నాలుగు విప్పి దిగువ ప్రాంతానికి వరదనీటిని జలమండలి అధికారులు వదులుతున్నారు. దీంతో హిమాయత్‌సాగర్ నుంచి రాజేంద్రనగర్ రోడ్డుపై పూర్తిగా జలమయమైంది. ఈ రహదారిపై వరదనీరు పారుతుండటంతో ట్రాఫిక్ పోలీసులు రోడ్డుకు ఇరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేసి రోడ్డును మూసివేశారు. ఈ ప్రాంతాన్ని ఉదయం ట్రాఫిక్ డీసీపీ సాయి మనోహర్‌తో పాటు ఏసీపీ బాలాజీ, రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శంషాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన వాహనదారులు, స్థానికులు, వరద నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుతం వరద పెరుగుతుండటంతో నాలుగు గేట్లను ఎత్తారని.. వరద కారణంగా హిమాయత్‌సాగర్‌కు వెళ్లే రహదారి పూర్తిగా నీటితో మునిగిపోయిందన్నారు. ఈ నేపథ్యంలో రహదారిని మూసివేశామన్నారు. వరద తగ్గుముఖం పట్టగానే రహదారిని పునరుద్ధరిస్తామని వారు వివరించారు.

మార్కెట్లలో మెరుగైన వసతులు కల్పిస్తాం

నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్

మణికొండ: నార్సింగి మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్‌లలో రైతులు, పశు వ్యాపారులకు మెరుగైన వసతులను కల్పిస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్ అన్నారు. సోమవారం మార్కెట్ కమిటీ పరిధిలోని బబ్బుగూడలో బోరు వేసే పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... మార్కెట్ కమిటీకి బబ్బుగూడ నుంచి మంచి ఆదాయం వస్తున్నదని, గతంలో అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యాపారులు కోరటంతో ఆ దిశగా పనులు చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లో వారికి షెడ్లు, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బాల్‌రెడ్డి, లక్ష్మీశ్రీ, సాదిక్, వ్యాపారులు పాల్గొన్నారు.



బోరు పనులను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్

వృద్ధుడి అదృశ్యం



లక్ష్మయ్య

శంషాబాద్ రూరల్: అర్ధ రాత్రి ఇంటి నుంచి వెళ్లిన ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... గనెమోని లక్ష్మయ్య(70) చౌదరిగూడలోని తన కూతురు కటికెల పద్మ ఇంట్లో నివాసముంటున్నాడు. ఈ నెల 7న రాత్రి అందరూ భోజనం చేసి నిద్రపోయారు. అర్ధరాత్రి లక్ష్మయ్య ఇంట్లో ఎవరి చెప్పకుండా వెళ్లిపోయాడు. గమనించిన కూతురు అతని కోసం అన్ని చోట్ల వెతికినా ఆచూకీ దొరకలేదు. సోమవారం ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. సోమవారం 9వ డివిజన్‌లోని బాబామ్మ కాలనీలో తడి, పొడి, చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ యాదయ్య, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగుతో తప్పని ఇబ్బంది



శంషాబాద్ రూరల్: మురుగు రోడ్డుపై వరదలా పారుతోంది. వాహనదారులతో పాటు పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కాచారం గ్రామానికి వెళ్లే దారిలో భూగర్భ మురుగు కాలువ పొంగి పొర్లుతోంది. దీంతో మురుగంతా రోడ్డుపై ప్రవహిస్తోంది. అంతేకాకుండా వరదనీటికి అడ్డుగా నిర్మించిన అక్రమ కట్టడాలతో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీంతో వరదనీరు సైతం రోడ్డుపై నుంచి వెళ్తుండటంతో తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదు.

ప్రాణం పోసే వైద్యులపై దాడులు దారుణం

- శంషాబాద్ ఐఎంఏ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- దాడుల సంస్కృతి సరికాదంటూ డీసీపీకి వినతి



శంషాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు

శంషాబాద్: ప్రాణం పోసే వైద్యులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడం ఎంతవరకు న్యాయమని వైద్యులు ప్రశ్నించారు. ఇటీవల వైద్యం వికటించి ఓ మహిళ మృతి చెందిన సంఘటనలో శంషాబాద్ లిమ్స్ ఆస్పత్రిపై బాధితులు చేసిన దాడికి నిరసనగా శంషాబాద్ ఐఎంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) వైద్యులు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. రోగి క్షేమమే తప్ప వారికి హాని జరగాలని వైద్యులెవరూ కోరుకోరని స్పష్టం చేశారు. రోగులు చికిత్సకు సహకరించినంత మేరకు వైద్య సేవలు అందుతాయని వెల్లడించారు. ఉద్దేశపూర్వకంగా రోగులకు హాని తలపెట్టాల్సిన తీరుగా వైద్యులు ప్రవర్తించరనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని సూచించారు. లిమ్స్ ఆస్పత్రిలో చేరించిన రోగి కండిషన్ విషమంగా ఉందనే విషయాన్ని కుటుంబ సభ్యులకు ముందే సూచించినట్లు ఆస్పత్రి ఎండీ రామరాజు స్పష్టం చేశారు. రోగి మృతిని ఆస్పత్రికి ఆపాదిస్తూ తీవ్రమైన దాడి జరపడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. వైద్యులు, సిబ్బంది, మహిళలపై కూడా దాడులు చేశారన్నారు. వైద్యుల ర్యాలీకి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలు సంఘీభావం తెలిపారు. అనంతరం వైద్యుల బృందం శంషాబాద్ డీసీపీ రాజేష్‌కు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు



మాత్ర వేస్తున్న జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు

శంషాబాద్: వైద్యుల సూచనల మేరకు నులి పురుగుల నివారణ మాత్రలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు సూచించారు. పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల (బాయ్) హాస్టల్‌లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎం అండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ... ప్రభుత్వం సూచించిన విధంగా నులి పురుగుల మాత్రలు వేసుకోవాలన్నారు. ఖాళీ కడుపుతో కాకుండా ఏమైనా తిన్న తర్వాతే వేయాలన్నారు. 1 నుంచి 2 సంవత్సరాల లోపు చిన్నారులకు సగం మాత్ర మెత్తగా నూరి వేయాలన్నారు. 2 నుంచి 19 లోపు పిల్లలకు ఒక మాత్ర వేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులున్న పిల్లలకు వీటిని వేయకూడదని ఆయన స్పష్టం చేశారు.

రాజేంద్రనగర్‌లో...

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ ఇనిస్టిట్యూట్‌లో సోమవారం రంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలనకు మాత్రలను (ఆల్బెండజోల్) రంగారెడ్డి వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలందరికి అంగన్‌వాడీ కార్యకర్తలు, సబ్ సెంటర్‌లలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో పంపిణీ చేస్తున్నమన్నారు. చిన్నారులలో ఆలసట, బలహీనత, కడుపునొప్పి సమస్యలకు స్వస్తి పలకవచ్చునని... పిల్లల్లో శక్తి, ఆకలిని పెంపొందిస్తాయన్నారు. శంషాబాద్ ఎంపీఓడీ మున్నీ, జిల్లా రోగ నిరోధకత అధికారి డాక్టర్ శిఖా హయత్, కళాశాల ప్రిన్సిపాల్ రాత్లావత్ ఫకీరా, డాక్టర్ విజయ పూర్ణిమ, డాక్టర్ దివ్య, జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

బండ్లగూడ: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించేలా కృషి చేస్తున్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్ బాబమ్మ కాలనీకి చెందిన రాజుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ. 60 వేలకు సంబంధించిన చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేద ప్రజల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, నాయకులు గోకరి సురేష్‌గౌడ్, సాగర్‌గౌడ్, సంగారెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, మహమ్మద్ ఖాజా తదితరులు పాల్గొన్నారు.



సందడిగా ననాజీపూర్ కత్వా

శంషాబాద్ మండల పరిధిలోని ఎంటేరువాగు వరదనీటితో పోటెత్తుతోంది. ఈ నేపథ్యంలో ననాజీపూర్ కత్వా వద్ద వరదనీరు పొంగి పొర్లుతుండటంతో జలపాతాన్ని తలపిస్తుంది. సందర్శకులతో ఈ ప్రాంతం సందడిగా మారింది. పాల్మాకుల మైసమ్మ చెరువు అలుగు పారడంతో పాటు భారీ వర్షాలు కురుస్తుండటంతో ఈ వాగులో వరద పోటెత్తుతుంది. – శంషాబాద్ రూరల్